క్లుప్తంగా

వేతనాలు చెల్లించాలని నిరసన



ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనం వద్ద బైఠాయించిన కార్మికులు

గాండ్లపెంట: వేతనాలు మంజూరు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు శనివారం నిరసన తెలియజేశారు. సీఐటీయూ నాయకుడు సాంబశివ మాట్లాడుతూ వేతన బకాయి చెల్లించాలని కోరినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 20వ తేదిలోపు వేతనాలు చెల్లిస్తామని చెప్పారు.

మండల మీట్ వాయిదా

రామగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరంలేనందున వాయిదా వేశామని ఎంపీడీఓ గంగావతి తెలిపారు. శనివారం జరిగిన సమావేశానికి పేరూరు1 ఎంపీటీసీ సభ్యుడు మాత్రమే హాజరవడంతో వాయిదా అనివార్యమైంది. రామగిరి మండలంలో పదిమంది ఎంపీటీసీ సభ్యులుండగా గత డిసెంబర్‌లో రామగిరి ఎంపీటీసీ సభ్యురాలు, అప్పటి ఎంపీపీ మీనుగ నాగమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయం విదితమే. సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి

గాండ్లపెంట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ గజ్జల సోమశేఖర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా, వారి కింది స్థాయి సిబ్బంది హాజరయ్యారు. రోడ్డురవాణా సంస్థ, విద్యుత్, బీసీ హాస్టల్ వార్డెన్, పీఆర్ జేఈ, రోడ్డు భవనాల శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, ఎంఈఓ కృష్ణానాయక్, వైద్యాధికారి మహేశ్వరమారుతి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ సునిత పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



గ్రోమోర్ ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ, ఏఓ

ఎన్‌పీకుంట: రైతులకు ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వరరెడ్డి ఎరువుల దుకాణ యజమానులను హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను రెవెన్యూ అధికారిని శారద, ఏఎస్‌ఐ కిశోర్‌రెడ్డితో కలిసి ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాలలో స్టాక్ రిజిష్టర్, నిల్వ ఉన్న ఎరువులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ఎరువులను విక్రయించాలన్నారు. దుకాణాల్లో రోజూ తప్పనిసరిగా స్టాక్‌బోర్డు రాయాలని, నిల్వ ఉన్న స్టాక్, స్టాక్ రిజిష్టర్‌లో ఉన్న ఎంట్రీలు సమానంగా ఉండాలన్నారు.

స్వామిత్వ సర్వే ప్రారంభం

బత్తలపల్లి: లింగారెడ్డిపల్లిలో స్వామిత్వ సర్వేను అధికారులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ క్రిష్టప్ప మాట్లాడుతూ ప్రజలకు చెందిన ప్రతి ఆస్తిపైన ఖచ్చితమైన వివరాలను సేకరించే క్రమంలో సర్వే చేపడుతున్నారన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు. సంజీవపురం సెక్రటరీ భాస్కర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జగన్ గ్రామస్తులకు సర్వేపై అవగాహన కల్పించారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

గాండ్లపెంట: మండల కేంద్రానికి సమీపంలో చిన్న మిట్టవద్ద నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి వ్యాపారవేత్త దేవకి నటరాజశెట్టి రూ.1,25,116 చెక్కును ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులకు శనివారం అందించారు. కుమారుడు సందీప్, కోడలు యామిని పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగు...

లాభాలు బాగు



ఎగువ బత్తినవారిపల్లి వద్ద సాగులో ఉన్న మొక్కజొన్న పంట

- ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ
- మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు

తనకల్లు: సాంప్రదాయ పంట అయిన వేరుశనగ సాగు వరుసగా నష్టాలు తెస్తుండడంతో రైతులు ప్రత్యామ్నయ పంటలపై దృష్టి పెడుతున్నారు. వేలాది రుపాయలు అప్పు తెచ్చి, పంటలు సాగు చేసినా చివరకు నష్టాలే మిగులుతుండడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. మండలంలోని రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్న సాగు చేయడానికి ఖర్చు తక్కువగా ఉండడంతో పాటు ఆదాయం ఎక్కువగా ఉండడంతో ఈ ఏడాది సాగు ఆశాజనకంగా ఉంది. మండల వ్యాప్తంగా ఈ సంవత్సరం దాదాపు 1,700 ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశారు. మందులు, ఎరువులు, కూలీల ఖర్చు కూడా ఇతర పంటలతో పోలిస్తే చాలా తక్కువగా ఉండడంతో రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు. అన్ని ఖర్చులు కలిపి ఎకరాలో మొక్కజొన్న సాగు చేయడానికి రూ. 20 వేల నుంచి రూ. 25 వేలు ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. ఎకరాలకు దాదాపు 30 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా మొక్కజొన్న నాణ్యతను బట్టి రూ. 2,800 వేల నుంచి రూ. 3,200 వరకు పలుకుతోంది. అన్ని ఖర్చులు పోనూ ఎకరాకు రూ.70 వేలు నుంచి రూ. 80 వరకు ఆదాయం వస్తుందని రైతులు చెప్తున్నారు. దీంతో మొక్కజొన్న సాగు చేయడం ద్వారా మంచి లాభాలు పొందుతున్నట్లు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్న సాగు పెరిగింది

మొక్కజొన్న పంటను సాగు చేయడానికి ఖర్చు తక్కువ అవుతుంది. గతంలో పోలిస్తే ఈ ఏడాది మండలంలో మొక్కజొన్న సాగు బాగా పెరిగింది. దీనికి కారణం మార్కెట్లో మొక్కజొన్నకు మంచి ధరలు ఉండడమే. వ్యాపారులు నేరుగా పంటను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి పెట్టారు.

– భారతి, ఏఓ, తనకల్లు

ఖర్చు తక్కువ



నేను మూడు ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశా. పంట సాగుకు రూ. 60 వేలు ఖర్చు వచ్చింది. వేరుశనగ, ఇతర పంటలతో పోలిస్తే మొక్కజొన్న సాగుకు తక్కువ ఖర్చవుతుంది. శ్రమ కూడా తక్కువే. ఆదాయం బాగానే ఉంటుంది. వ్యాపారులు పొలం వద్దకు వచ్చి పంట కొనుగోలు చేస్తున్నారు.

– చలపతి, రైతు, బత్తినవారిపల్లి, తనకల్లు

ఆశాజనకం



గతంలో వేరుశనగ సాగు చేశాం. వేరుశనగు సాగుతో నష్టాలే అధికం. ప్రస్తుతం 15 ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశా. సాగుకు రూ. 2 లక్షలు ఖర్చు అయ్యింది. పంట ఆశాజనకంగా ఉంది. మార్కెట్లో మొక్కజొన్నకు మంచి ధర ఉంది. మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నా.

– నారాయణరెడ్డి, రైతు, మబ్బువారిపల్లి,తనకల్లు

హామీల అమల్లో చంద్రబాబు విఫలం



రామగిరిలో 'చంద్రబాబు మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

రామగిరి: హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలోల కోతలు విధిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమతాలు, ప్రాంతం, పార్టీలను చూడకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పథకాలను సక్రమంగా అందజేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పథకాల అమలులో మోసం చేస్తోందని, చంద్రబాబు అంటే మోసం గ్యారంటీ అని ప్రజలకు అర్థమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు...అండగా ఉంటా



కుళ్లాయిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



వైస్ ఎంపీపీ సూర్యనారాయణ భార్య లక్ష్మమ్మను పరామర్శిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: అధైర్యపడొద్దు, అండగా ఉంటానంటూ వైఎస్సార్ సీపీ పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధైర్యం చెప్పారు. మండలంలోని పలు బాధిత కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. పుల్లగూరపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అంకిరెడ్డి కుళ్లాయిరెడ్డి(72), గంగాపురానికి చెందిన మేక సంతోష్‌రెడ్డి(38) వేర్వేరు కారణాలతో శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే కొండకిందద తండాకు చెందిన వైస్ సర్పంచ్ ఆర్. రెడ్డెప్పనాయక్(62), డి. ప్రసాద్‌నాయక్ (40), ఎస్. నారాయణ స్వామి నాయక్ కుమార్తె గౌతమిబాయి(20), కుటాలపల్లి తండాకు చెందిన ఎస్. శీనా నాయక్ భార్య ముత్యాలీబాయి (46) వేర్వేరు కారణాలతో ఇటీవల మృతిచెందారు. శ్రీధర్‌రెడ్డి ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే శీకివారిపల్లికి చెందిన వైస్ ఎంపీపీ కే. సూర్యనారాయణ భార్య లక్ష్మమ్మ, కుటాలపల్లికి చెందిన బాలక్రిష్టారెడ్డి, ఆసం నరసింహారెడ్డి, ఎస్సీ కాలనీకి చెందిన లక్ష్మన్న, గంగాపురానికి చెందిన రాంమోహన్‌ను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుంగావత్ రమేష్‌నాయక్, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, వైస్ ఎంపీపీ కె.సూర్యనారాయణ, మండల మాజీ కన్వీనర్లు పొరకల రామాంజనేయులు, కుళ్లాయినాయక్, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎ. గంగిరెడ్డి, సర్పంచులు పార్వతీబాయి, కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, లింగమూర్తి, నరసింహమూర్తి, నాగరాజునాయుడు, ఎంపీటీసీ శివారెడ్డి, మండల కమిటీ సభ్యులు సీతారాం, యర్ర సూరి, ప్రతాప్‌నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాజేంద్రనాయక్, యూత్ మండల అధ్యక్షులు హరినాథరెడ్డి, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, కొక్కంటి సాంబశివారెడ్డి, మంగేనాయక్, చంద్రహాసరెడ్డి, చెర్లో మాధవరెడ్డి, కోనపల్లి నరసింహారెడ్డి, వేళ్లమద్ది హరి, కొక్కంటి శ్రీనివాసరెడ్డి, రామక్రిష్టారెడ్డి, నారాయణస్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ధర్మవరం రూరల్: ప్రభుత్వం సెప్టెంబర్ 5న ఇచ్చిన జీఓను వ్యతిరేకిస్తూ శనివారం మండలంలోని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు అంకే శ్రీధర్, వంశీ, వేల్పుల మోహన్ తదితరులు మాట్లాడుతూ గతంలో ఒక వలంటీర్ ఒక క్లస్టర్ మ్యాపింగ్ ఉండగా, ఇప్పుడు ఒక ఉద్యోగిని ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్ మ్యాపింగ్ చేసి బలవంతంగా ఇంటింటికి తిరిగి వాట్సాప్ సరీ్వసుపై అవగాహన కల్పించాలనడం సరికాదన్నారు. అనంతరం పరిపాలన అధికారి నబీకి వినతి పత్రం ఇచ్చారు. చివాలయ ఉద్యోగులు పద్మ, లావణ్య, శ్రావణీ, రోషనార, మోహన్, మంజునాథ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గురువులు.. సమాజ మార్గదర్శకులు



ఎమ్మార్సీలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఎన్‌పీకుంట: సమాజానికి గురువులే మార్గదర్శకులని ఎంఈఓ గోపాల్‌నాయక్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మార్సీలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడిన హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుదర్శన్ గోపాల్, హబీబుల్లా, రామ్మోహన్, లాలూసాబ్, జ్యోతి, రవీంద్రారెడ్డి తదితరులను సన్మానించారు. టీ.ఎన్.పల్లి జెడ్పీ హెచ్‌ఎస్‌లో కమ్మగుట్టపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వేమా జయప్రతాప్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు వీరారెడ్డి, టోపీవలి, మదన్‌ప్రతాప్, కమలమ్మను సన్మానించారు.

మీ సేవలు వెలకట్టలేనివి



పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ రత్న, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: పోలీస్ శాఖలో మీరు అందించిన సేవలు వెలకట్టలేనవని ఎస్పీ రత్న కొనియాడారు. జిల్లాలోని పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐలు శ్రీరాములు, కళావతి, ఏఎస్‌ఐలు మస్తాన్, వెంకటరాముడు పదవీవిరమణ పొందారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ సిబ్బంది ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎస్పీ రత్న ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బందితో కలసి పదవీ విరమణ పొందిన ఎస్‌ఐ, ఏఎస్‌ఐలను సత్కరించి మెమెంటో అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ సర్వసాధారణమని, ఉద్యోగరీత్యా కష్టపడి పనిచేశారని ఇప్పటి నుంచి ఆయుఆరోగ్యాలతో సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరెండెంట్‌లు మల్లిఖార్జున, సరస్వతి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు మహేష్,వలి, సీసీ చిరంజీవి పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు ఖాసీంకు పరామర్శ

నల్లచెరువు: దేవిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఖాసీంను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పరామర్శించారు. గాండ్లపెంట మండలం తూపల్లిలో ఖాసీం కుమార్తె మెహతాజ్ (28) భర్త చేతిలో శుక్రవారం రాత్రి హత్యకు గురైంది. శనివారం దేవిరెడ్డిపల్లిలో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, నాయకులు జొన్నా రామమూర్తి, మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతి, పోరెడ్డి చెన్న కేశవరెడ్డి, తదితరులు పాల్గొని మెహతాజ్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆదివారం దేవిరెడ్డిపల్లికి వైఎస్సార్‌సీపీ కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ వెళ్లి ఖాసీం కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్లు మండల కన్వీనర్ తెలిపారు.

'జనం గుండెల్లో జగనన్న' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: జనం గుండెల్లో జగనన్న.. ప్రజల శక్తి శ్రీధరన్న.. పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. అదే విధంగా సాయి అండ్ టీం రూపొందించిన పాటలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఫొటో సాయి, షాషు, కన్వీనర్లు రవినాయక్, ఈశ్వరయ్య, ఎంపీపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ గంగాద్రి, కౌన్సిలర్ సాయిగీత, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, పాదయాత్ర శంకర్, మల్లికార్జున, రామయ్య, కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గులగానయ్యస్వామి గుడిలో చోరీకి యత్నం

కనగానపల్లి: మండలంలోని తగరకుంట గ్రామ సమీపంలో ఉన్న గులగానయ్య వేంకటేశ్వరస్వామి గుడిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. గ్రామస్తుల వివరాల మేరకు. తగరకుంట గ్రామానికి సమీపంలో గులగానయ్య కొండపై పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇక్కడికి ప్రతి శని, ఆదివారాల్లో మాత్రమే భక్తులు వెళ్తుంటారు. దీంతో రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గర్భగుడి ఎదుట ఉన్న కటాంజనం గేటు తలుపు తాళం పగలగొట్టి లోపలకు వెళ్లారు. ప్రధాన ద్వారం తలుపు తీసి హుండీ చోరీ చేయాలని ప్రయత్నించి.. తాళం రాకపోవటంతో అక్కడి నుంచి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు.

దిగుమతులపై సుంకాన్ని తగ్గించాలి



కళాజ్యోతి సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ధర్మవరం: అమెరికా భారతదేశ దిగుమతులపై సుంకాన్ని తగ్గించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నియోజకవర్గ కార్యదర్శి పోలా లక్ష్మీనారాయణ, ఆర్‌ఎస్‌పీ నాయకుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా దిగుమతులపై సుంకాన్ని పెంచడంతో ఆక్వా, టెక్స్‌టైల్స్ ,గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు పడిపోయాయన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికాకు ఏటా సుమారు 2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయన్నారు. దిగుమతి సుంకం పెంపుతో ఆక్వా, గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లోని ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికుల ఉపాధికి గండిపడుతోందన్నారు. మన దేశ ప్రయోజనాలు కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు నీలం శివప్రసాద్, సిరివెళ్ల దేవేంద్ర, ఆర్‌ఎస్‌పీ నేత నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరించడం సామాజిక బాధ్యత



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: ఉపాధ్యాయులను సత్కరించుకోవడం సామాజిక బాధ్యత అని ఆర్డీఓ సువర్ణ, బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు , హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ అన్నారు. శనివారం బుక్కపట్నం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శివరామకృష్ణ ఆధ్వర్యంలో పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు చేసే కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జగదీష్, మహబూబ్‌బాషా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మహమ్మద్ ఇషాక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు

గాండ్లపెంట: అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార బాబురావు, ఏఓ సయ్యద్ షాదాబ్ హెచ్చరించారు. శనివారం మలమీదపల్లి పంచాయతీ రైతు సేవా కేంద్రంలో తహసీల్దార్, ఏఓ ఆధ్వర్యంలో 140 మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

మహిళా సమాఖ్య మండల కార్యవర్గం ఎన్నిక

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలోని తిమ్మమాంబ మండల సమాఖ్య కార్యాలయంలో 21వ ఆర్థిక మహాసభ శనివారం నిర్వహించారు. ఏపీఎం వెంకటనారాయణ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలిగా మంగమ్మ, ఉపాధ్యక్షురాలిగా జ్యోతి, కార్యదర్శిగా అమృత, కోశాధికారిగా రమాదేవి ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో సంబంధిత అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎల్‌సీసీసీ, సీసీలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్య పరిష్కరించాలి

పుట్టపర్తి టౌన్: లో ఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని కోవెలగుట్టపల్లి గ్రామస్తులు విద్యుత్ ఏఈ సాయినాథ్ గౌడ్‌ను కోరారు. శనివారం పట్టపర్తి పట్టణంలో ఉన్న ఏఈ కార్యాలయంలో ఏఈకి వినతి ప్రతం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో లో ఓల్టేజీసమస్య అధికంగా ఉందని, తద్వారా టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, బల్బులు కాలిపోయి తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. గతంలో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా.. సమస్య పరిష్కరించినట్లు మెసేజ్ వస్తోందని, కానీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే సింధూరారెడ్డికి గ్రామ పర్యటనలో విన్నవించినా ఫలితం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారిస్తామని ఏఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రభాకర్, శంకర్, హర్ష, భరత్, సాయికృష్ణ, వినోద్‌కుమార్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

బత్తలపల్లి: రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం రామాపురం ఉన్నత పాఠశాలలో కోచింగ్ క్యాంపును ప్రారంభించారు. ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో 10వ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు పాఠశాల పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ముల్లగూరు అయ్యప్పనాయుడు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, బాల్ బ్యాడ్మింటన్ జిల్లా సెక్రటరీ వెంకటేష్, స్టేట్ ప్రెసిడెంట్ గౌస్‌ముద్దీన్, బాష, కంబగిరి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లి కొత్త బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కుటాగుళ్లకు చెందిన వెంకటేశ్, అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గాయపడిన వారిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో వెంకటేష్ పరిస్థితి విషంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న ట్రైనీ ఎస్‌ఐ డి.సుమతి పట్టణ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ఘటనపై ఆరాతీశారు. ఔట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సుంకాల విధింపుపై మోదీ మౌనం వీడాలి

పుట్టపర్తి టౌన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాల వల్ల రైతులతో పాటు ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నా ప్రధాని మోదీ నోరు మెదపడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై. వెంకటేశ్వర్‌రావ్, రాంభూపాల్ విమర్శించారు. శనివారం పుట్టపర్తిలో గణేష్ కూడలిలో అమెరికా వల్ల పన్నుల పెరుగుదలపై సీపీఎం, సీఐటీయూ నాయకులు నిరసన తెలియజేశారు. జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షులు పెనుకొండ హరి, జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, నాయకులు శ్రీనివాసులు, నరశింహులు, లక్ష్మీనారాయణ, దిల్షాద్, వెంకటేష్, ఫిరంగి ప్రవీన్ సిద్దు, బాబా పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి బలవన్మరణం

ధర్మవరం రూరల్: ధర్మవరం–చిగిచెర్ల రైల్వే స్టేషన్ మధ్య శుక్రవారం రాత్రి గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడని రైల్వే పోలీసులు శనివారం తెలిపారు. యువకుడు 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, తెలుపు, బూడిద రంగు చొక్కా, ఆక్సో డ్రాయర్ ధరించినట్లు వారు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిరుపేద కుమ్మరులను ఆదుకుంటాం

బత్తలపల్లి: నిరుపేదలైన కుమ్మర కులస్తులను అన్నివిధాలుగా ఆదుకుంటామని ఏపీ కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో మదనాపు కొండన్న ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమ్మరులు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కుమ్మర సంఘం జిల్లా నాయకులు మదనాపు కొండన్న చైర్మన్ ఈశ్వర్, డైరెక్టర్ సజ్జల దిన్నె కుమ్మరి వెంకటసుబ్బయ్యను దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. కుమ్మర సంఘం నాయకులు ఓబుళపతి, రామాంజనేయులు, తాడిపత్రి గోపి, కదిరి వేణు, బత్తలపల్లి మండల నాయకులు రాము, కృపాకర్, రమేష్ పాల్గొన్నారు.